ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	588.50 (310.5510)	2,60,611	2,51,238
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.60 (3.84)	3,372	1,296
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.88 (41.05)	2,30,788	2,30,788

చికెన్ ధరలు | లైవ్ : రూ.110 | డ్రెస్ : రూ.160 | స్కిన్‌లెస్ : రూ.190



రైతుకు భరోసా ఏదీ!

గత ప్రభుత్వ హయాంలో కొనసాగిన రైతుబంధును కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందా? లేదా అనే సందిగ్ధంలో పడింది. గుట్టలకు, చెట్లకు, పుట్టలకు, రోడ్లకు, ఇటుక బట్టీల స్థలాలకు, వెంచర్లకు రైతుబంధు పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం డబ్బును వృథా చేసిందని గతంలో కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పించారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గత పార్లమెంట్ ఎన్నికలకు ముందు రైతుబంధును పూర్తిస్థాయిలో అమలు చేసింది. రైతుబంధులో మార్పులు చేయాలని ప్రస్తుత ప్రభుత్వం యత్నించినా దీనిపై నేటికీ ఎలాంటి ప్రకటన లేదు. ఫలితంగా రైతుబంధు అమలులో అనుమానాలు నెలకొన్నాయి.

- నల్లగొండ

- ఇంకా నిర్ణయం తీసుకోని ప్రభుత్వం
- వానాకాలం సీజన్‌కు అందని పెట్టుబడి సాయం
- ఇప్పటికీ రూపొందని మార్గదర్శకాలు
- ఉమ్మడి జిల్లాలో 11లక్షల మందికి పైగా రైతుల ఎదురుచూపు

రైతుబంధును ప్రభుత్వం రైతుభరోసా పేరుతో ఉమ్మడి జిల్లాల స్థాయిలో రైతుల అభిప్రాయాలు తీసుకుంది. ప్రస్తుతం ఆ ఫైల్‌ను ప్రభుత్వం ఆటకెక్కించింది. అభిప్రాయాలను తీసుకున్న తరువాత అసెంబ్లీలో చర్చ పెట్టి అమలు చేస్తామని చెప్పినా, తీరా అసెంబ్లీలో చర్చను సైతం పక్కన పెట్టింది. ఇంతలో రుణమాఫీపై దృష్టిసారించి ప్రభుత్వం రైతుభరోసాను పట్టించుకోకపోవడంతో రైతులకు పెట్టుబడి సాయం అందకుండా పోయింది. రుణమాఫీ విషయంలో ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తాయి. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండానే ప్రభుత్వం కాకి లెక్కలు చెబుతోందని ప్రతిపక్షాలు విమర్శించాయి. ఈ నేపథ్యంలో రైతుభరోసా అమలు చేసే విషయంలో ప్రభుత్వం తాత్సారం చేస్తుండగా, రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం అధికారుల నుంచి నివేదికలు తీసుకొని రైతులకు భరోసా కల్పించకపోవడం ఎంత వరకు సమంజసమని పలు రైతు సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 11లక్షల మంది రైతులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 11లక్షల మందికిపైగా రైతులు ఉన్నారు. అందులో నల్లగొండ జిల్లాలో 5.50లక్షల మంది, సూర్యాపేట జిల్లాలో 3.50లక్షల మంది, యాదాద్రి జిల్లాలో 2.10లక్షల మందికిపైగా రైతులు ఉన్నారు. సాగు భూమి 21 లక్షల ఎకరాల వరకు ఉంది. ప్రభుత్వం వ్యవసాయ పెట్టుబడులకు రైతులకు భరోసా కల్పించకపోవడంతో వారు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వానకాలం సీజన్ ముగియవస్తున్నా, నేటికీ ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించలేకపోయింది. గత ప్రభుత్వ హయాంలో ఎంత భూమి ఉన్నా ఎకరానికి రూ.5వేల చొప్పున రైతుబంధు ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఎకరానికి రూ.7500 చొప్పున ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావొస్తున్నా దీనిపై అతీగతి లేదు. రైతుభరోసా అమలుకు ముందుకు వెళ్లాలంటే ఎన్ని ఎకరాలు ఇవ్వాలనే దానిపై కటాఫ్ ప్రకటించాల్సి ఉంది. అప్పటి ప్రభుత్వం భూమి ఎంత ఉన్నా ఇచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం ఎంత వరకు తగ్గించాలి? ఎన్ని ఎకరాలకు ఇవ్వాలనేది తేల్చలేని పరిస్థితుల్లో ప్రభుత్వం డైలమాలో ఉన్నట్టు సమాచారం.

యాసంగికైనా అందేనా?

వానాకాలం సీజన్ ముగుస్తున్నా రైతుభరోసాపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కనీసం వచ్చే యాసంగి నాటికైనా వానాకాలంతో పాటు యాసంగికి రెండు సీజన్లకు కలిపి పెట్టుబడి సాయం అందిస్తారా? లేదా అనే దానిపై తేల్చాల్సి ఉంది. దీనిపై ప్రభుత్వ నిర్ణయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుత వానాకాలంలో వర్షాలు ఆలస్యంగా కురవడం తో ఇప్పుడిప్పుడే మెట్టపంటల్లో ప్రధానమైన పత్తి చేలు జీవం పోసుకున్నాయి. ఈ నేపథ్యంలో పత్తి చేలతో పాటు వరి సాగు కు రైతులకు పెట్టుబడుల అవసరం పెరిగింది. చేతిలో డబ్బు లేక రైతులు అప్పులు చేస్తున్నారు. ఎకరానికి రైతులు రూ.25వేల చొప్పున పెట్టుబడులు పెట్టారు. ప్రైవేట్ వ్యక్తుల దగ్గర అధిక వడ్డీకి డబ్బు తెచ్చిన రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. రైతు భరోసాను కాంగ్రెస్ ప్రభుత్వం అదనంగా ఎకరాకు రూ.2,500 అంటే మొత్తం రూ.7,500 ఇస్తామని ప్రకటించడంతో ఎంతో ఆశపడిన రైతులు ప్రభుత్వ నిర్ణయం ప్రకటించకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. అసలు ఈ రెండు సీజన్లలో రైతుభరోసాపై నిర్ణయం జరుగుతుందా? లేక వాయిదా వేస్తారా? అనే అనుమానాలు రైతుల్లో ఉన్నాయి. వాస్తవానికి అయితే ఈ వానాకాలంలో జూన్ నెలాఖరులో రైతుభరోసా రావల్సి ఉంది. అయితే రెండు నెలలు పైగా గడిచినా నేటికీ నిర్ణయం తీసుకోలేదు.

మార్గదర్శకాలు వచ్చిన వెంటనే అమలు

రైతుభరోసాపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదు. విధివిధానాలు రూపొందించి విడుదల చేసిన అనంతరం రైతాంగానికి పెట్టుబడి సాయం అందుతుంది. రైతుభరోసాపై ప్రభుత్వం రైతుల నుంచి అభిప్రాయాలు కూడా సేకరించింది. వీటిన్నంటిని పరిగణనలోకి తీసుకొని రైతుభరోసాను అమలు చేస్తుంది. ఎకరాకు రూ.7.500 ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా త్వరలో ఉత్తర్వులు రానున్నాయి.

- పి.శ్రవణ్‌కుమార్, నల్లగొండ, జేడీఏ

అభిప్రాయాలు ఓ వైపు... నిధుల భారం మరో వైపు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నుంచి సేకరిస్తున్న అభిప్రాయాల్లో జిల్లాకు ఒకలా భిన్నంగా ఉన్నాయి. కొంతమంది 10ఎకరాల వరకు రైతుభరోసా కల్పించాలని, మరికొంత మంది 15ఎకరాల వరకు, ఇంకొందరు 5ఎకరాల వరకు ఇవ్వాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే భూమి ఎంత ఉన్నా గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఇవ్వాలనే డిమాండ్ కూడా వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా కాకుండా తక్కువ భూమికి రైతుభరోసా ఇస్తే రైతుల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశాలు ఉన్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రహించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 11 సార్లు రైతుబంధును అమలు చేసింది. అప్పట్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు దాదాపు ప్రతీ సీజన్‌లో రూ.1,450కోట్లకు పైగా రైతుబంధు వచ్చేది. ప్రస్తుతం 11లక్షల మందికి పైగా రైతులకు గతంలో మాదిరిగా అమలు చేస్తే ఎకరాకు రూ.7500 చొప్పున ఏటా రెండు సీజన్లలో రూ.15వేలు చెల్లిస్తే ప్రభుత్వంపై మరింత భారం పడే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో తక్కువ భూమికే రైతుభరోసా చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందా? లేక 10ఎకరాలు ఉన్న రైతులకు కూడా రైతుభరోసా ఇస్తుందా? అనేది వేచిచూడాల్సిందే. కటాఫ్‌పై నిర్ణయం తీసుకోకపోవడం వల్ల ఏ జిల్లాకు ఎంత నిధులు సమకూర్చాలనే దానిపై రాష్ట్ర ప్రభుత్వంతోపాటు ఆర్థికశాఖ కూడా కసరత్తు చేయాలి. ఈ నేపథ్యంలో రైతుభరోసాపై ప్రభుత్వం ఎటూ తేల్చుకోలేక నాన్చుడు ధోరణిని అవలంబిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



భూసేకరణకు కసరత్తు

సాగునీటి కాల్వల పునరుద్ధరణకోసం ప్రభుత్వం భూసేకరణకు సన్నాహాలు చేస్తోంది. జిల్లాలోని బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పునరుద్ధరణ పనులు, భూసేకరణపై అంచనాలు రూపొందించేందుకు సన్నాహాలు చేస్తోంది. అయితే సాగునీటి ప్రాజెక్టులకోసం భూసేకరణ, భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లించడం ప్రభుత్వానికి సవాల్‌గా పరిణమించింది. అయితే స్థానిక ఎమ్మెల్యేలు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి భూసేకరణ చేసిన పక్షంలో.. ఎన్ని నిధులైనా ప్రభుత్వం ఇస్తుందని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో జిల్లాలో పనులు చకచకా కొనసాగుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి-యాదాద్రి)


- బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పునరుద్ధరకు సన్నాహాలు
- భూసేకరణతోపాటు చేపట్టాల్సిన పనుల కోసం అంచనాలు
- కాల్వలు వెడల్పుతో మరో 36వేల ఎకరాలకు అదనంగా ఆయకట్టు

యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల్లో చేపట్టిన పిలాయిపల్లి, బునాదిగాని, ధర్మారెడ్డి కాల్వల పునరుద్ధరణకు సాగునీటి శాఖ అధికారులు రూ.384.43 కోట్ల మేరకు అంచనాలు రూపొందించారు. అయితే జిల్లాలోని బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వలను ప్రస్తుతం ఉన్న డిజైన్‌లో కాకుండా దూరదృష్టితో తిరిగి రీడిజైన్లు చేయాలని, లైనింగ్ స్ట్రక్చర్ చేస్తే అదనంగా ఆయకట్టు సాగులోకి వస్తుందని స్థానిక ప్రజాప్రతినిధులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆగస్టు 30న భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గస్థాయిలో సాగునీటి ప్రాజెక్టులు, కాల్వల పురోగతిపై స్థానిక ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మూసీ పరివాహక ప్రాంతాల్లోని ఎమ్మెల్యేలంతా కూడా కాల్వలు వెడల్పు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అయితే స్థానిక ప్రజాప్రతినిధులు, రైతుల విన్నపం మేరకు సరికొత్తగా.. ప్రస్తుతం ఉన్న డిజైన్ కాకుండా 15 అడుగుల వరకు పెంచేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. తద్వారా జిల్లాలో మూడు కాల్వల కింద ప్రస్తుతం ఉన్న ఆయకట్టు కంటే 86వేల ఎకరాలు అదనంగా రానుందని ఎమ్మెల్యేలు కోరుతున్నారు. అయితే భూసేకరణ ప్రధాన సమస్యగా మారింది. రైతులతో స్థానిక ఎమ్మెల్యేలు చర్చించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బునాదిగాని కాల్వ పనులు చేపట్టేందుకు గతంలో దాదాపు 200 ఎకరాల వరకు భూసేకరణ చేపట్టేందుకు అధికారులు సిద్ధం చేశారు. అయితే కాల్వలను వెడల్పు చేయాలని యోచిస్తున్న నేపథ్యంలో బునాదిగాని కాల్వకు దాదాపు 350 ఎకరాలకు పైగా ధర్మారెడ్డి, పిలాయిపల్లి కాల్వలకు 250 ఎకరాల వరకు భూసేకరణ చేపట్టే అవకాశం ఉంది. ఈ మేరకు సాగునీటి శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు భూసేకరణపై కసరత్తు ప్రారంభించారు. త్వరలోనే మూసీ పరివాహక ప్రాంతాల రైతులతో సమావేశాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

20 ఏళ్లుగా నిరీక్షణ

వర్షాకాలంలో మూసీలోకి ప్రవహించే ఎగువ వరద నీటిని వినియోగించుకునేందుకు కాల్వల నిర్మాణానికి గత ప్రభుత్వాలు శ్రీకారంచుట్టాయి. బునాదిగాని, ధర్మారెడ్డి, పిలాయిపల్లి కాల్వల పునరుద్ధరణ పనులు మూడు అడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కి అన్న చందంగా ఉన్నాయి. ఈ పనులు నత్తనడకన సాగుతుండడంతో గత 20 ఏళ్లుగా సాగునీటికోసం రైతులు నిరీక్షిస్తున్నారు. కాల్వల పునరుద్ధరణలో భాగంగా పనులు చేపట్టేందుకు ఇప్పటివరకు ముగ్గురు కాంట్రాక్టర్లు మారారు. మట్టి పనులే తప్ప, ఇప్పటివరకు పూర్తిస్థాయిలో సిమెంట్‌తో నిర్మించిన కల్వర్టులు నిర్మించలేదు. కాంట్రాక్టర్లు మట్టి పనులుచేసి చేతులు దులుపుకున్నారు. కల్వర్టులు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ఆధునికీకరణ పనులతోపాటు భూసేకరణ చేపట్టాల్సి ఉంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2017లో ధర్మారెడ్డి, బునాదిగానీ, పిలాయిపల్లి కాల్వల నిర్మాణంకోసం ప్రభుత్వం రూ.284.85కోట్లు మంజూరు చేసింది. అప్పటివరకు 20వేల ఎకరాల ఆయకట్టు నుంచి 60వేల వరకు పెంచేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ నిధుల్లో ధర్మారెడ్డి కాలువకు రూ.65కోట్ల మేరకు కేటాయించింది. బునాదిగాని కాల్వకు రూ.100 కోట్లు, పిలాయిపల్లి కాల్వకు రూ.119.58 కోట్లు కేటాయించింది. భూసేకరణతోపాటు కాల్వల పునరుద్ధరణ, కల్వర్టుల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించింది. గత ఆరేళ్ల నామమాత్రంగా పనులు చేపడుతున్నారే తప్ప, పూర్తిస్థాయిలో పనులు చేపట్టలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా కాల్వల పునరుద్ధరణ పూర్తయ్యేనా? అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాల్వలు పునరుద్ధరిస్తే 60వేల ఎకరాలకు సాగునీరు



పిలాయిపల్లి, బునాదిగాని, ధర్మారెడ్డి కాల్వలను గతంలో రూపొందించిన అంచనాల ప్రకారం పునరుద్ధరించిన పక్షంలో యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల్లోని ఏడు మండలాల్లో 60వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. గత ప్రభుత్వాలు అంచనాల ప్రకారం 50 క్యూసెక్కుల నీరు రైతుల పొలాల్లోకి వెళ్లేది. అయితే 2016లో ప్రభుత్వం కాల్వల పునరుద్ధరణతో 200 క్యూసెక్కులు అందించాలన్న లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించింది. ధర్మారెడ్డి కాల్వను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తే వలిగొండ, భూదాన్‌పోచంపల్లి, రామన్నపేట, చిట్యాల, నకిరేకల్ మండలాల్లోని 49 చెరువులు కుంటలు నిండుతాయి. ఈ నీటితో మూడు మండలాల్లో 17,500 ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం ఉంది. ఈ కాల్వ పొడవు మొత్తం 51 కిలోమీటర్లకు 102కల్వర్టులు నిర్మించాలి. పిలాయిపల్లి కాల్వ ద్వారా భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్, రామన్నపేట, చిట్యాల మండలాల్లో 18 డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌తో 46 చెరువులు నిండనున్నాయి. ఈ కాల్వ ద్వారా 22,500 ఎకరాలకు సాగునీరు అందనుంది. బునాదిగాని కాల్వ 98 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఈ కాల్వ పునరుద్ధరిస్తే ఏడు మండలాల్లోని 93 చెరువులు నిండనున్నాయి. మొత్తం 20 వేలకు పైగా ఎకరాల్లో సాగునీరు అందనుంది. అయితే ప్రభుత్వం కాల్వలను వెడల్పు చేయడంతో మరో 36వేల ఎకరాలు అదనంగా ఆయకట్టు సాగులోకి రానుంది.

ఐలమ్మ ఆశయాలు సాధించాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 10: తెలంగాణ ఉద్యమ వీర వనిత చాకలి ఐలమ్మ ఆశయాల స్ఫూర్తిని కొనసాగించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచానికి తెలిసిన వీర వనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. నిరంకుశ నిజాం పాలనకు ఎదురొడ్డి నిలిచిన ఉక్కు మహిళ చాకలి ఐలమ్మని కొనియాడారు. కార్యక్రమంలో డీటీవో రవికుమార్, బీసీ అభివృద్ధి అధికారి అనసూయ, డీడబ్ల్యూవో నర్సింహారావు, దున్నశ్యాం, డీసీడీవో లత, డీఈవో అశోక్, డీటీడీవో శంకర్, సట్టు నాగయ్య, అచ్చయ్య, ఉపేందర్, సైదులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న ఇంజనీర్ ప్రసాద్

మేళ్లచెర్వు, సెప్టెంబరు 10: స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో నిర్ణీత సమయంలో రాజగోపురాన్ని పూర్తిచేయాలని దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కనుకదుర్గ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని ఇష్టకామేశ్వరి సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో దక్షిణం వైపున నూతనంగా నిర్మిస్తున్న ఐదు అంతస్తుల రాజగోపుర నిర్మాణాన్ని ఆయన మంగళవారం పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అంతకు ముందు ఆలయ ఈవో కొండారెడ్డి, ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో అధికారులు రాజేశ్వరరావు, రాజయ్య, దామోదర్, ఆలయ కమిటీ సభ్యులు నర్సింహారావు, అర్చకులు విష్ణువర్థన్‌శర్మ, ధనుంజయశర్మ, శిల్పి వేణు, తదితరులు పాల్గొన్నారు.

మహేష్‌కుమార్‌ను కలిసిన రమేష్‌రెడ్డి



మహేష్‌కుమార్‌గౌడ్‌కు బొకే అందజేస్తున్న రమేష్‌రెడ్డి

సూర్యాపేట అర్బన్, సెప్టెంబరు 10: నూతనంగా ఎన్నికైన టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను మంగళవారం హైదరాబాద్‌లో పర్యాటక అభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఆయనవెంట ముదిరెడ్డి రమణారెడ్డి, గట్టు శ్రీనివాస్, ధరావత్ వెంకన్ననాయక్, ఎడ్ల వీరమల్లు యాదవ్, జనార్థన్‌రెడ్డి, భాస్కర్‌నాయక్, రవినాయక్ ఉన్నారు.

యువత వ్యసనాల బారిన పడొద్దు

- యువకులపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉంది
- మాదక ద్రవ్యాలతో సర్వస్వం కోల్పోతారు
- ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్

భానుపురి, సెప్టెంబరు 10: యువత వ్యసనాల బారిన పడొద్దని ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్వీ కళాశాల ఆడిటోరియంలో డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉందని, డ్రగ్స్ నిర్మూలన కోసం బాధ్యతగా వ్యవహరించాలన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని కళాశాలల్లో యాంటి డ్రగ్స్ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. డ్రగ్స్ వినియోగంతో శరీరంలో శక్తి తగ్గుతుందన్నారు. గంజాయి, కొకైన్, హెరాయిన్‌లాంటి మాదకద్రవ్యాల వల్ల సర్వస్వం కోల్పోతారన్నారు. డ్రగ్స్ తీసుకుంటే జ్ఞాపక శక్తి, చురుకుదనం తగ్గిపోతాయన్నారు. సమాజంలో జరిగే అనర్థాలు, నేరాలు, దాడుల నిర్మూలనలో విద్యార్థులు, యువత భాగస్వామ్యం కావాలన్నారు. సైబర్ నేరగాళ్లు ఉచితాల ఆశ చూపి ఖాతాల్లో సొమ్ము కాజేస్తారని, ఓటీపీ, పిన్ నెంబర్లు ఎవరికీ చెప్పవద్దన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్‌లో సంప్రదిస్తే వ్యక్తిగత వివరాలు వెల్లడించ వద్దన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలపై పోలీస్ కళాబృందం అవగాహన కల్పించింది. కార్యక్రమంలో డీఎస్పీ రవి, సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్, ఎస్వీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు అండగా..

సూర్యాపేటక్రైం: పోలీస్ శాఖలో సిబ్బందికోసం అమలు చేస్తున్న చేయూత పథకం వారి కుటుంబాలకు అండగా నిలుస్తుందని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్మ్‌డ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ రాములు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా చేయూత కార్యక్రమంలో భాగంగా ఆయన కుటుంబ సభ్యులకు రూ.2లక్షల చెక్కును అందజేసి మాట్లాడారు. చేయూత పథకానికి ప్రతీనెల విరాళాలు అందిస్తున్న జిల్లా సిబ్బందికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌గౌడ్, మంజుభార్గవి, సాయిరాం పాల్గొన్నారు.

శాంతియుతంగా నిమజ్జనం నిర్వహించాలి

శాంతియుతంగా గణేష్ నిమజ్జనాన్ని నిర్వహించాలని ఆర్డీవో వేణుమాధవ్‌రావు, డీఎస్పీ రవి అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని సద్దుల చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించి మాట్లాడారు. ఈ నెల 16న ఉదయం నుంచి రాత్రి వరకు శాంతియుతంగా వచ్చి నిమజ్జనం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, సీఐ రాజశేఖర్, నాయకులు కక్కిరేణి శ్రీనివాస్, రుక్మారావు, సత్యారావు, రమేష్, పాండు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు కేంద్ర బృందం రాక

- పంట నష్టంపై అంచనా వేయనున్న అధికారులు
- హుజూర్‌నగర్, కోదాడల్లో పర్యటన

హుజూర్‌నగర్, సెప్టెంబరు 10: హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో భారీ వరదలతో నష్టపోయిన పంట పొలాలను పరిశీలించేందుకు కేంద్ర బృందం బుధవారం రానుంది. హుజూర్‌నగర్ పట్టణం, మండలంలోని బూరుగడ్డ, గోపాలపురంతోపాటు మేళ్లచెర్వు మండలం రేవూరు, మఠంపల్లి మండలం చౌటపల్లి, పులిచింతల, వజినేపల్లి, బుగ్గమాదారం, నడిగూడెం, బరాఖత్‌గూడెం, తొగర్రాయి, కూచిపుడి, బరాఖాత్‌గూడెం తదితర గ్రామాల్లో కేంద్ర బృందం పంట పొలాలను పరిశీలించనున్నారు. ఈ సందర్భంగా పంట నష్టంపై అంచనా వేయనున్నారు. కేంద్ర బృందంలో రాష్ట్రానికి చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. ఈ మేరకు కేంద్ర బృందం పర్యటన సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు రూట్‌మ్యాప్ ఖరారు చేశారు.

కోదాడ రూరల్: ఇటీవల కురిసిన భారీవర్షాల వల్ల నష్టపోయిన పంటలు, ఇళ్లు, బాధితులను పరామర్శించేందుకు కేంద్ర బృందం బుధవారం కోదాడ, తొగర్రాయి, కూచిపూడి గ్రామాల్లో పర్యటించనుందని అధికారులు తెలిపారు. బృందం సభ్యులకు రైతులు నష్టం వివరాలు అందించాలని వివరించారు.



వైభవంగా లక్ష దీపోత్సవం

హుజూర్‌నగర్, సెప్టెంబరు 10: పట్టణంలోని సాయిబాబా నగర్‌లో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మంగళవారం మహిళలు లక్ష దీపోత్సవం నిర్వహించారు. వినాయకుడి మండపం ఎదుట లక్ష దీపోత్సవం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు దీపాలు వెలిగించి స్వామివారిని వేడుకున్నారు. కార్యక్రమంలో గజ్జి ప్రభాకర్, విజయలక్ష్మి, దోసపాటి నరసింహమూర్తి, గాయత్రి,భాస్కర్, సుజాత, హేమవాణి, కవిత, కోటేశ్వరరావు, రాము, దుర్గా, వెంకన్న, శైలజ, వసంత, కవిత, మాధవిలత, నందు, రాము పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 10 : యాదగిరిగుట్ట క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనృసింహ స్వామికి నిత్యపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత అంజనేయస్వామికి పంచామృతాభిషేకం జరిపి పుష్పాలతో అలంకరించారు. సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు చేపట్టారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, సుదర్శన నారసింహ హోమం, నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలను నిర్వహించారు. పాతగుట్ట ఆలయం, విష్ణు పుష్కరిణి, కొండపైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ ప్రత్యేకపూజలు చేపట్టారు. కొండపైన శివాలయంలో నిత్యపూజలు, నిత్యరుద్రహవనం కొనసాగాయి. వివిధవిభాగాల ద్వారా రూ.9,99,013 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



16వ ఫైనాన్స్ కమిషన్ సభ్యులకు ప్రసాదాలు అందజేస్తున్న ఈవో

యాదగిరీశుడిని దర్శించుకున్న ఫైనాన్స్ కమిషన్ సభ్యులు

లక్ష్మీనరసింహస్వామిని 16వ ఫైనాన్స్ కమిషన్ సభ్యులు అజయ్ నారాయణ ఝా, డాక్టర్ సౌమకాంతి ఘోష్‌తో పాటు కమిషన్ సభ్యులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈవో భాస్కర్‌రావు ప్రసాదాలు అందజేశారు. వారి వెంట ఆర్డీవో కర్ణన్, కలెక్టర్ హనుమంతు కే జెండగే ఉన్నారు.

భ్రూణ హత్యకు పాల్పడితే జైలుకే

మోత్కూరు, సెప్టెంబరు 10: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, భ్రూణహత్యకు పాల్పడితే మొదటిసారి మూడేళ్ల జైలు, రూ.10 వేలు జరిమానా, రెండోసారి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా ఉంటుందని ఆడపిల్లల రక్షణ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుమన్‌కళ్యాణ్ హెచ్చరించారు. భ్రూణ హత్యలకు సహకరించిన వారికీ శిక్షలు తప్పవన్నారు. ఆడపిల్లల రక్షణ చట్టంపై ఆరోగ్య, మహిళా, శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరులోని వైజే ఫంక్షన్ హాల్లో మోత్కూరు, ఆత్మకూరు(ఎం), గుండాల, అడ్డగూడూరు మండలాలల్లో ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్లకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో ఆయనతో పాటు డెమో ఆఫీసర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ ఆసుపత్రుల వైద్యులు హేమంత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, సీడీపీవో జ్యోత్స్న, సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు చెన్న కృష్ణయ్య, ప్రధానకార్యదర్శి కందికట్ల లక్ష్మయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యుడు కోక బిక్షం, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, మండల గౌరవాధ్యక్షుడు ఎడ్ల యాదగిరి, అధ్యక్షుడు గనగాని నర్సింహ, రఘువర్ధన్, పురుగుల రమేష్, ధనుంజయ్య, పరశురాములు వెంకన్న, సోమలింగాచారి, శ్రీనివాస్, రాజయ్య పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 10: గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి-అద్దంకి జాతీయరహదారిపై కిష్టాపురం గ్రామంవద్ద సోమవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు, రూరల్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పల్లా సైదమ్మ(55) గ్రామంలో సోమవారం రాత్రి నిర్వహించిన గణేష్ శోభాయాత్రలో పాల్గొని రోడ్డుపై నడుచుకుంటూ ఇంటికి వెళ్తోంది. ఇదే సమయంలో గుర్తుతెలియని వాహనం సైదమ్మను ఢీకొట్టింది. దీంతో ఆమె తలకు బలమైన గాయాలయ్యాయి. గమనించి స్థానికులు 108వాహనంలో చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందిందని ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. సైదమ్మ మృతితో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. ఆమె కుమారుడు విజయ్ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో యువకుడు..


నరేష్(ఫైల్ ఫొటో)

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 10 : గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చిన్నతుమ్మలగూడెంలో మంగళవారం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్తుల ద్వారా తెలిసిన వివరాలిలా ఉన్నాయి. చిన్నతుమ్మలగూడెం గ్రామానికి చెందిన కమ్మాలపల్లి లింగయ్య, సత్తమ్మ దంపతుల చిన్న కుమారుడు నరేష్(30) పీజీ పూర్తిచేశాడు. హైదరాబాద్‌లో ఉంటూ గ్రూప్-2 ఉద్యోగానికి సిద్ధమవుతున్నాడు. కాగా మంగళవారం ఉదయం గదిలో ఉండగా ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పాడు. దీంతో అతడిని వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు చేస్తుండగానే చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లిదండ్రులు గ్రామంలోనే వ్యవసాయం చేస్తూ కుమారుడిని చదివిస్తూ ప్రభుత్వ ఉద్యోగిగా చూడాలనుకున్నారు. కానీ కుమారుడు గుండెపోటుకు గురై చనిపోవడంతో వారు కన్నీటిపర్యంతమయ్యారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధదంపతులకు గాయాలు

చిట్యాల, సెప్టెంబరు 10 : నల్లగొండ జిల్లా చిట్యాలలో హైదరాబాద్-విజయవాడ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. మండలంలోని చిన్నకాపర్తి గ్రామానికి చెందిన వృద్ధదంపతులు దాసరి పార్వతమ్మ, దాసరి నర్సింహులు మంగళవారం చిట్యాలకు వచ్చారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది, ఈ సంఘటనలో గాయపడిన దంపతులను చికిత్సనిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ధర్మా తెలిపారు.

పాఠశాలలో కట్ల పాము


పాఠశాలలో గ్రామస్తులు చంపిన పాము

నూతన్‌కల్, సెప్టెంబరు 10 : సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం బక్కహేమ్లతండా లోని పాఠశాలలో మంగళవారం కట్ల పాము కనిపించింది. రోజు వారి మాదిరిగానే విద్యార్థులు పాఠశాలకు వచ్చారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్లను తీయడానికి డబ్బాను తెరవగా అందులో కట్ల పాము కనిపించింది. అప్రమత్తమైన ఉపాధ్యాయులు గ్రామస్తులకు సమాచారం అందించారు. వెంటనే పాఠశాలకు చేరుకున్న స్థానికులు పామును చంపారు. దీంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. పాఠశాలలో స్కావెంజర్లు లేకపోవడంతో పాఠశాలలో ఎప్పుడు ఏంచేరుతున్నాయో తెలియని పరిస్థితి ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మద్యానికి భార్య డబ్బులివ్వలేదని ఆత్మహత్య


వెంకటయ్య(ఫైల్)

చిట్యాల రూరల్, సెప్టెంబరు 10 : మద్యం తాగేందుకు భార్య డబ్బులివ్వలేదని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తిలో మంగళవారం జరిగింది. ఎస్ఐ ధర్మ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చిన్నకాపర్తికి చెందిన తిర్మలదాసు వెంకటయ్య(50) కుల వృత్తి మంగలి పనిని చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా వెంకటయ్య మద్యానికి బానిసయ్యాడు. తాగేందుకు భార్య అండాలు డబ్బులు అడగ్గా, ఆమె ఇవ్వకపోవడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మద్యం తాగేందుకు భార్య డబ్బులు ఇవ్వలేదని మనస్తాపానికి గురైన వెంకటయ్య సొంత పొలం వద్దకు వెళ్లి క్రిమిసంహారక మందును తాగి వాంతులు చేసుకున్నాడు. సమీపంలో పనిచేసుకుంటున్న పాకాల అంజయ్య గమనించి వెంకటయ్య పెద్దకుమారుడికి సమాచారమిచ్చాడు. పొలం వద్దకు వెళ్లిన పెద్దకుమారుడు మత్స్యగిరి తండ్రిని అంబులెన్స్‌లో నార్కట్‌పల్లి శివారులోని కామినేని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. చిన్నకుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుతున్నామని ఎస్ఐ తెలిపారు.

హాలియాలో పట్టపగలు చోరీ


వేలిముద్రలను పరిశీలిస్తున్న క్లూస్ టీం

హాలియా, సెప్టెంబర్ 10 : నల్లగొండ జిల్లా హాలియా మునిసిపాలిటీ పరిధిలో మంగళవారం పట్టపగలు నగదు చోరీ అయ్యింది. ఈ సంఘటన మాజీ ఎంపీటీసీ చెరుపల్లి ముత్యాలు ఇంట్లో జరిగింది. ఎస్ఐ సతీష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సాయిప్రతాప్‌నగర్‌లో నివాసముంటున్న చెరుపల్లి ముత్యాలు మధ్యాహ్నం ఇంటికి తాళం వేసుకొని బయటకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేరని గమనించిన దొంగలు తాళం పగులగొట్టి రూ.1,70,000 నగదును చోరీ చేసినట్లు తెలిపారు. కొద్దిసేపటికి ఇంటికి వచ్చిన ముత్యాలు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు క్లూస్ టీంని రప్పించి వేలిముద్రలను పరిశీలించారు. బాధితుడు ముత్యాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఒక్కరోజుల్లో నిందితురాలి అరెస్ట్

రూ.6లక్షల విలువైన 9.4తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

నల్లగొండ, సెప్టెంబరు 10 : నల్లగొండ జిల్లా కేంద్రంలో చోరీ కేసులో నిందితుడిని పోలీసులు 24 గంటల్లో అరెస్టు చేశాడు. అతడి నుంచి రూ.6 లక్షల విలువైన 9.4 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 8వ తేదీన నల్లగొండ పట్టణంలోని శాంతినగర్ కాలనీలోని బాలాజీ ఫంక్షన్‌హాల్ వద్ద నివాసముంటున్న మలాన్ అనే మహిళ ఉదయం 11 గంటల సమయంలో కుటుంబ సమేతంగా ఆమె చెల్లెలు శుభకార్యానికి వెళ్లి తిరిగి ఇంటికి అదేరోజు రాత్రి 8 గంటలకు వచ్చింది. ఆ సమయంలో ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించింది. బీరువాలో పెట్టిన రూ.6లక్షలు విలువైన 9.4తులాల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో సోమవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన ఎస్ఐలు సందీప్‌రెడ్డి, శంకర్ లు రెండు బృందాలుగా క్రైం పార్టీ సిబ్బందితో పాటు కలిసి సమీప సీసీ టీవీ కెమెరాలను పరిశీలించారు. ప్రియదర్శినికాలనీలో ఉంటున్న నిందితురాలైన కొత్తపల్లి ధనలక్ష్మిని ఆమె అద్దెకుంటున్న ఇంటి వద్ద మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకోవడమే కాకుండా ఆమె వద్ద నుంచి దొంగతనం చేసిన సొత్తును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా 24 గంటల్లోనే కేసును ఛేదించడంతో పాటు సొత్తును రికవరీ చేసిన వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ సందీప్‌రెడ్డి, శంకర్‌ను, క్రైం సిబ్బంది షకీల్, శ్రీకాంత్‌లను ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వేములపల్లి, సెప్టెంబరు 10 : నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. రావులపెంట మూసీ వాగు నుంచి అనుమతులు లేకుండా గ్రామానికి చెందిన ఇంద్రపల్లి సుదర్శన్, పిట్టల ప్రవీణ్ తమ ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ మేరకు ట్రాక్టర్ యజమానులు సుదర్శన్, ప్రవీణ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

జూదరుల అరెస్టు

చౌటుప్పల్ రూరల్ సెప్టెంబరు 10: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శివారులో జూదరులను అరెస్టు చేసినట్లు సీఐ మన్మథరావు తెలిపారు. ఆంథోల్‌మైసమ్మ దేవాలయం సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం రాత్రి పేకాటాడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.26,410 నగదు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

యాదాద్రి మెడికల్ కళాశాలకు గ్రీన్‌సిగ్నల్

- ఈ విద్యా సంవత్సరం నుంచి 50 సీట్లతో ప్రారంభానికి హెచ్‌ఎంఎఫ్‌డబ్ల్యూ ఉత్తర్వులు
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా వాసులు


భువనగిరిలో ఏర్పాటుచేయనున్న ప్రభుత్వ వైద్యకళాశాల, భోదనాసుపత్రిగా మారనున్న జిల్లా కేంద్ర ఆసుపత్రి

భువనగిరి టౌన్, సెప్టెంబరు 10: ఎట్టకేలకు యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలో ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటుకు నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్‌ఎంసీ) క్లియరెన్స్ ఇచ్చింది. దీంతో కొన్ని నెలలుగా ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటుపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. భువనగిరిలో ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటుకు ఎన్‌ఎంసీ ఇచ్చిన లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్‌వోపీ) మేరకు వైద్య కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబసంక్షేమ శాఖ(హెచ్‌ఎంఎఫ్‌డబ్ల్యూ) మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ విద్యా సంవత్సరం నుంచి 50 సీట్లతో కళాశాల ప్రారంభం కానున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పట్టణ శివారు పగిడిపల్లిలోని పాతకలెక్టరేట్ భవనంలో వైద్యకళాశాల, హాస్టల్ ఏర్పాటు కానుండగా భువనగిరిలోని ప్రస్తుత జిల్లా కేంద్ర ఆసుపత్రి ఇక నుంచి వైద్య కళాశాల బోధనాసుపత్రిగా కొనసాగుతుంది. ఈ మేరకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాల, బోధనాసుపత్రి ప్యాట్రన్ మేరకు బదిలీలు, నూతన నియామకాల ద్వారా అన్ని స్థాయిల్లో మెజార్టీ పోస్టులను భర్తీ చేయగా మిగిలిన పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నారు. ప్రతీ విద్యా సంవత్సరం వైద్య సీట్లు పెరుగనున్నాయి. భువనగిరిలో వైద్య కళాశాల ఏర్పాటుతో జిల్లా విద్యార్థులకు ఎంబీబీఎస్ చదివేందుకు అవకాశాలు మెరుగయ్యాయి. అలాగే బోధనాసుపత్రితో వైద్యసేవలు పెరిగి రోగులకు ఉచిత నాణ్యమైన చికిత్సలు, రోగ నిర్ధారణ పరీక్షలు, మందుల పరంగా ఉపశమనం లభించనుంది. ఎన్‌ఎంసీ ఇచ్చిన ఎల్‌వోపీ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం అండర్ టేకింగ్ ఇచ్చిన అనంతరం ప్రక్రియ పూర్తయి వైద్యకళాశాల ప్రారంభం కానుంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు ఈ పాటికే అధికారులు పూర్తి చేసినట్లు సమాచారం.

ఊరించిన ఎన్‌ఎంసీ అనుమతులు

వైద్యకళాశాల ఏర్పాటులో ఎన్‌ఎంసీ అనుమతులు ముఖ్యమైనవి వైద్య కళాశాల, బోధనాసుపత్రిలో ఉన్న వసతులు, ఔట్ పేషంట్, ఇన్ పేషంట్ విభాగాలు, ప్రొఫెసర్స్, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్స్, రెసిడెంట్ డాక్టర్స్, నర్సింగ్ తదితర పోస్టుల భర్తీ తదితర అంశాలపై సమగ్ర పరిశీలన జరిపాకే ఎన్‌ఎంసీ అనుమతులు ఇస్తుంది. ఈ మేరకు భువనగిరిలో ప్రతిపాదించిన వైద్యకళాశాల కోసం జూన్ 23నుంచి ఎన్‌ఎంసీ బృందాలు ప్రత్యక్షంగా, ఆన్‌లైన్‌లో పలు దఫాలుగా పరిశీలన జరిపారు. అదే సమయంలో కళాశాల ఏర్పాటుకు అనుమతులు సాధించడాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో పాటు కొన్నేళ్ల పాటు రాష్ట్ర వైద్య, విద్య శాఖ డైరెక్టర్‌గా వ్యవహరించిన డాక్టర్ రమేష్‌రెడ్డిని కళాశాల ప్రిన్సిపల్‌గా, గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా వ్యవహరించిన డాక్టర్ రాజారావును జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. వారి అనుభవాల మేరకు ఎన్‌ఎంసీ బృందాలకు అవసరమైన సమగ్ర సమాచారాన్ని అందివ్వడం, లోపాలను సవరించడం, కలెక్టర్ హనుమంతు కే జెండగే పాలనాపరమైన సహకారం అందించారు. అదేవిధంగా ఇటీవలి వరకు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించి ప్రస్తుతం డీసీహెచ్‌ఎస్‌గా కొనసాగుతున్న డాక్టర్ చిన్నానాయక్ సకాలంలో అవసరమైన సమాచారాన్ని అందించారు. వీరికి తోడుగా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది కృషి ఫలితంగా వైద్య కళాశాల ఏర్పాటుపై జిల్లా ప్రజల కల నెరవేరుతున్నదని పలువురు అంటున్నారు. వైద్య కళాశాల ఏర్పాటుకు ఎన్‌ఎంసీ ఎల్‌వోపీ ఇవ్వడం, హెచ్‌ఎంఎఫ్‌డబ్ల్యూ ఉత్తర్వులు జారీ చేయడంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మలిసంధ్యలో అరుణవర్ణం

వర్షాలతో కొద్దిరోజులుగా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సూర్యుడి దర్శనమే కరువు కాగా మంగళవారం భానుడు తన ప్రతాపాన్ని చూపించాడు. సూర్యాస్తమయ సమయంలో ఆకాశం ఎర్రని రంగును పులుముకుని అరుణవర్ణంలో ప్రకాశవంతంగా కనిపించింది. వర్ణకాంతులు, ప్రకృతి అందాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

- మునుగోడు

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక


నల్లగొండ ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థులు

నకిరేకల్, సెప్టెంబరు 10: నల్లగొండ ఉమ్మడి జిల్లా నుంచి హ్యాండ్‌బాల్ జట్టును ఎంపిక చేసినట్లు నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య తెలిపారు. నకిరేకల్ మండలం మంగళపల్లి జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో జిల్లా జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు వరంగల్ జిల్లా కేంద్రంలో జేఎన్‌ఎస్ స్టేడియంలో జరిగే 38వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాలుర హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి 80 మంది క్రీడాకారులు జిల్లా జట్టుకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. మంగళపల్లి జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కర్రా వీరారెడ్డి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎండీ ఉస్మాన్, ఉపాధ్యాయులు లఘుశెట్టి సత్యనారాయణ, రాజేందర్, చైతన్యకుమార్, కవిత, అంజి, ముత్తు, రాజ్యలక్ష్మి ఎంపికైన జిల్లా జట్టు క్రీడాకారులను ఘనంగా అభినందించారు.

బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్టు ఎంపిక

నల్లగొండ స్పోర్ట్స్, సెప్టెంబరు 10 : బాల్ బ్యాడ్మింటన్ బాలబాలికల నల్లగొండ జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అవిశెట్టి బయ్యన్న తెలిపారు. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ మైదానంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 40 మంది క్రీడాకారులు హాజరై తమప్రతిభను ప్రదర్శించారు. పోటీలో అత్యంత ప్రతిభకనబర్చిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన వారు ఈ నెల 14వ తేదీ నుంచి 15వ తేదీ వరకు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి మైదానంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల పోటీలో పాల్గొననున్నట్లు బయ్యన్న వెల్లడించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన బాలుర జట్టులో గౌతమ్, సుశాంత్, వరుణ్, అజయ్, జశ్వంత్, చిన్ని, మనోజ్, అంజి, రామ్‌చరణ్, హనుమా, బాలికల విభాగంలో ఏకాంబరేశ్వరీ, భవ్యశ్రీ, కె.అలీనా, శృతి, జ్యోత్స్న, ఊహిత, కావేరి, శ్రీలత, అక్షిత, హరికలు ఉన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సత్తయ్య, జిల్లా క్రీడల నిర్వహణ కార్యదర్శి బాలునాయక్ పాల్గొన్నారు.

విధులు ముగించుకుని ఇంటికి వెళుతూ విషాదం

- రక్తపు వాంతులతో ఆర్టీసీ కండక్టర్ మృతి


ప్రకాష్ భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచుతున్న డీఎం సురేందర్, సీఐ సైదులు

శాలిగౌరారం, సెప్టెంబరు 10: విధులు ముగించుకుని ఇంటికి వెళుతున్న ఆర్టీసీ కండక్టర్ అకస్మాత్తుగా రక్తపు వాంతులు చేసుకుని మృతి చెందారు. మంగళవారం నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామశివారులో ఈ సంఘటన జరిగింది.ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శాలిగౌరారం మండలం వల్లాల గ్రామానికి చెందిన వైద్యుల ప్రకాష్(50) సూర్యాపేట ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. వల్లాల గ్రామంలోనే ఉంటూ సూర్యాపేటకు వెళ్తూ ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం డ్యూటీ ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. కడపర్తి-వల్లాల గ్రామాల మధ్యకు రాగానే ద్విచక్ర వాహనం నిలిపి అతడి పెద్ద కుమారుడు మహంత్‌కు ఫోన్ చేసి తనకు బాగా కడుపు నొప్పి వస్తోందని, తొందరగా రమ్మని చెప్పి అక్కడే ఉన్నాడు. కుమారుడు అక్కడికి చేరుకున్న కొద్దిక్షణాలకే రక్తపు వాంతులు చేసుకుని అపస్మారకస్థితిలో పడిపోయాడు. వెంటనే 108 వాహనంలో నకిరేకల్‌లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ప్రకాష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అందరితో కలిసిమెలిసి ఉండే ఉండే ప్రకాష్ ఆకస్మిక మృతితో పలువురు దిగ్భ్రాంత్రి వ్యక్తం చేశారు. సూర్యాపేట ఆర్టీసీ డీఎం ధర్మపురి సురేందర్, అసిస్టెంట్ మేనేజర్ బీ.సైదులు, ఏడీసీలు బొజ్జ సైదులు, మాచర్ల భాస్కర్ తదితరులు వల్లాల గ్రామంలోని ప్రకాష్ ఇంటికి చేరుకొని భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చి తమ సంతాపం, సానుభూతిని వెలిబుచ్చారు. కండక్టర్ ప్రకాష్ అకాల మరణం తీరనిలోటని డీఎం సురేందర్ అన్నారు.

పలుకరింపునకు వస్తే.. దొంగలుగా భావించి చితకబాదారు


దోతిగూడెం యువకుల దాడిలో గాయపడ్డ యువకులు

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 10: తెలిసిన వ్యక్తిని పలకరిద్దామని గ్రామానికి వస్తే, దొంగలు అనుకొని గ్రామస్తులు యువకులను చితకబాదారు. ఈ సంఘటన యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, గ్రామస్తుల కథనం ప్రకారం చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు గ్రామానికి చెందిన గరిక లింగస్వామి, పగడాల ప్రకాష్, పాపగళ్ల లక్ష్మీనారాయణ అనే యువకులు తెల్లవారుజామున మూడున్నర గంటల ప్రాంతంలో బీబీనగర్‌లో పనినిమిత్తం వెళ్తూ మార్గమధ్యలోని దోతిగూడెం గ్రామంలో కొలుపు చెప్పే యాట లింగస్వామి వ్యక్తిని పలకరించి వెళ్దామనుకున్నారు. వారు తమ కారు దిగి ఇంటి గల్లీలోకి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన యాట నరేష్ చూసి ఎవరో ఎవరో వ్యక్తులు వచ్చారని, దొంగలుగా భావించి వారిని పట్టుకుని బిగ్గరగా కేకలు వేశాడు. చుట్టుపక్కల గణేష్ మండపాల వద్ద ఉన్న యువకులు హుటాహుటిన వచ్చి ముగ్గురు యువకులను పట్టుకొని చితకబాదారు. కాగా, యువకులు తాము దొంగలం కాదని, లింగస్వామి ఇంటికి వచ్చామని చెప్పినా వారు వినిపించుకోలేదు. వెంటనే డయల్-100కు ఫోన్ చేయడంతో సంఘటనా స్థలానికి పోలీస్ పెట్రోలింగ్ వాహనం వెంటనే చేరుకుంది. గ్రామస్తుల చెర నుంచి ఆ యువకులను విడిపించి విచారించారు. గతంలో యాట లింగస్వామి దగ్గరికి కొలుపు చెప్పించుకున్నామని, మరోసారి అతడిని పలకరిద్దామని వచ్చామని చెప్పారు. గాయాలు తగిలిన యువకులను పోలీసులు చికిత్స నిమిత్తం బీబీనగర్ వెళ్తున్నామన్నారు. గాయాలు తగిలిన వ్యక్తులను చికిత్స నిమిత్తం పోలీసులు ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు అందకపోవడంతో కేసు నమేదు కాలేదని ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

గుండెపోటు బాధితుడిని బతికించిన సీపీఆర్


భాగ్యరాజుకు సీపీఆర్ చేస్తున్న గోవిందరెడ్డి

మేళ్లచెర్వు, సెప్టెంబరు 10 : గుండెపోటుకు గురైన వ్యక్తికి సీపీఆర్ చేసి బతికించారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం దొండపాడులో మంగళవారం జరిగింది. మండలంలోని దొండపాడు గ్రామానికి చెందిన రైతు దేరాంగుల భాగ్యరాజు గ్రామంలోని తమ పిల్లలకు మధ్యాహ్నం భోజనం బాక్సులు ఇచ్చేందుకు పాఠశాలకు వెళ్లి వస్తున్నాడు. మార్గమధ్యలో గుండెపోటు వచ్చి కిందపడ్డాడు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన అన్నపురెడ్డి గోవిందరెడ్డి భాగ్యరాజుకు సీపీఆర్ చేసి స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమ ఆసుపత్రికి తరలించారు. దీంతో భాగ్యరాజు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. భాగ్యరాజుకు గుండెపోటు వచ్చిందని వైద్యులు నిర్ధారించారు. గోవిందరెడ్డి సమయస్ఫూర్తిని స్థానికులు అభినందించారు.

పెట్రోల్‌కు బదులు నీళ్లు


పెట్రోల్‌తో పాటు వచ్చిన నీరు

మేళ్లచెర్వు, సెప్టెంబరు 10 : సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల కేంద్రంలోని హెచ్‌పీ బంక్‌లో పెట్రోల్‌తో పాటు నీరు వచ్చింది. మంగళవారం పెట్రోల్ కొట్టించిన వినియోగదారులకు పెట్రోల్‌తో పాటు నీరు కూడా వస్తున్నట్లు అనుమానంతో బాటిల్‌లో పెట్రోల్ కొట్టించారు. బాటిల్‌లో పెట్రోల్‌తో కలిసి నీరు రావటంతో వినియోగదారులు బంకు ఎదుట నిరసన తెలిపారు. బంక్ సిబ్బంది వినియోగదారుల నిరసన మధ్యలో బంకుకు తాళాలు వేసి సిబ్బంది అక్కడి నుంచి జారుకున్నారు. ఇప్పటికైనా అధికారులు బంక్‌ను తనిఖీ చేసి సీజ్ చేయాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

పులిచింతల పరిసరాల్లో మొసలి కలకలం


వాగులో ప్రత్యక్షమైన మొసలి

మేళ్లచెర్వు, సెప్టెంబరు 10 : తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లోని పులిచింతల ప్రాజెక్టు పరిసరాల్లో మొసళ్లు కలకలం సృష్టిస్తున్నాయి. గత కొద్దిరోజుల కిందట చింతలపాలెం మండలంలోని గుడిమల్కాపురం వాగులో మొసలి పిల్లలు కనిపించిన ప్రదేశానికి సమీపంలో మంగళవారం మరో మొసలి స్థానికులకు కనిపించింది. దీంతో స్థానికులు ఫొటోలు తీసి స్థానిక వాట్సాప్‌లో గ్రూపులో పోస్టు చేశారు. ఈ ప్రాంతంలో రెండు పెద్దమొసళ్లు తిరుగుతున్నాయని, మొసలి పిల్లలు సంచరిస్తున్నాయని, భారీ వర్షాలకు, వరదలకు ఈ ప్రాంతానికి కొట్టుకు వచ్చి ఉంటాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

హరితహారం చెట్లు నరికివేత



చింతపల్లి, సెప్టెంబర్ 10 : గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరితహారంలో భాగంగా పెంచిన చెట్లను ఇష్టానుసారంగా నరికివేశారు. వేంకటేశ్వరనగర్‌లోని హైవే సమీపంలో రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగి చెట్లుగా మారాయి. ఆ మొక్కలను అనుమతుల్లేకుండా నరికివేశారు. ఈ విషయమై గొడుకొండ్ల గ్రామ కార్యదర్శి పద్మను వివరణ కోరగా రహదారికి ఇబ్బంది కలగకుండా నరికివేసినట్లు ఆమె తెలిపారు.

ఆదిపరాశక్తిగా దర్వేశీపురం ఎల్లమ్మ



కనగల్, సెప్టెంబరు 10 : నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని దర్వేశీపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు మంగళవారం ఆదిపరాశక్తిగా భక్తులకు దర్శనమిచ్చారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమఅభిషేక పూజలు జరిపించి చీరసారెలను, బోననైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

బిల్లులు మంజూరు
చేయండి సారూ

మాజీ సర్పంచ్ వేడుకోలు



తిరుమలగిరి రూరల్, సెప్టెంబరు 10: గ్రామంలో అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాలని తిరుమలగిరి మండలం మర్రికుంట తండా గ్రామ మాజీ సర్పంచ్ దేవానాయక్ కోరారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రెండేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 'ఉపాధి' నిధులు రూ.20 లక్షలు మంజూరు కాగా, అప్పులు తెచ్చి భవనాన్ని నిర్మించానన్నారు. ఈ భవన నిర్మాణాన్ని 10నెలల క్రితం పూర్తి చేయగా, ప్రస్తుత ఎమ్మెల్యే మందుల సామేలు ఈ భవనాన్ని తొమ్మిది నెలల క్రితం ప్రారంభించారన్నారు. నేటి వరకు బిల్లు రానందున ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. అలాగే గ్రామాభివృద్ధిలో భాగంగా పరిశుభ్రత, పైపు లైను, నీటి పనుల కోసం మరో రూ.5లక్షలు వెచ్చించినా, నేటికీ ఏ బిల్లూ రాలేదన్నారు. బిల్లులు చెల్లించి తనను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

బిల్లు చెల్లించి ఆదుకోవాలి



గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ. 20లక్షలు, గ్రామాభివృద్ధికి మరో రూ. 5లక్షలు ఖర్చు చేశా. అప్పు తీసుకువచ్చి ఈ పనులను పూర్తి చేశా. పదవీ కాలం ముగిసి ఏడు నెలలు గడిచినా నేటికీ ఒక్క రూపాయి బిల్లు కూడా రాలేదు. బిల్లులు చెల్లించి ఆదుకోవాలి.
- దేవానాయక్, మాజీ సర్పంచ్, మర్రికుంటతండా

నిధులు రాలేదు



గ్రామాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రావల్సి ఉంది.. గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనందున ఆ నిధులు రాలేదు. ఈ నిధులు రాగానే ఎంబీ ప్రకారం విడుదల చేస్తాం.
- భీంసింగ్, ఎంపీవో

ఐలమ్మ ఆశయాలను సాధించాలి

వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు సామేలు, పద్మావతి, పలువురు నాయకులు



జిల్లా కేంద్రంలోని బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ నాయకులు

సూర్యాపేట టౌన్, సెప్టెంబరు 10: వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలను సాధించాలని పలువురు నాయకులు అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఆమె చిత్రపటాలకు, విగ్రహాలకు నివాళులర్పించారు. సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కొత్త బస్‌స్టేషన్ ఎదుట ఐలమ్మ చిత్రపటానికి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు.

● బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సూర్యాపేటలో నిర్వహించిన ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో గుజ్జ యుగంధర్‌రావు, తాటికొండ సీతయ్య, గుండగాని రాములుగౌడ్, తునికి సాయిలు, దొంగరి శ్రీనివాస్, మట్టిపల్లి వెంకట్, గోపగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: మండలంలోని బూరగడ్డ గ్రామంలో ఐలమ్మ చిత్రపటానికి మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ నివాళులర్పించారు. రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిలర్ త్రివేణి, దుగ్గి బ్రహ్మం, దీపా వెంకన్న, సైదులు పాల్గొన్నారు.

కోదాడ: తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ముఖ్య పాత్ర పోషించారని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. మునిసిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, వంగవీటి రామారావు, పారా సీతయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, సట్టు నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

● పట్టణంలోని ఐలమ్మ విగ్రహానికి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు.

మేళ్లచెర్వు: మండల కేంద్రంలో ఐలమ్మ చిత్రపటానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, పల్లె వెంకటరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐలమ్మ స్ఫూర్తితో ప్రజలు ప్రజా సమస్యలపై పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వట్టెపు సైదులు, సుందరమౌలేశ్వర్‌రెడ్డి, పుల్లయ్య, జానయ్య, వెంకన్న, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

మోతె: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంఘమిత్ర, ఎంపీడీవో ఆంజనేయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తుంగతుర్తి: తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చేసిన పోరాటం మరువలేనిదని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మండలంలోని వెంపటి గ్రామంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడి తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటిచెప్పిన చాకలి ఐలమ్మను అందరూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దొంగరి గోవర్ధన్, దాయం ఝాన్సీరెడ్డి, సుంకరి జనార్దన్, వెంకన్న పాల్గొన్నారు.

అర్వపల్లి: ఐలమ్మ వర్ధంతి సందర్భంగా జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాల గ్రామంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు దూదిగామ సంపత్, బాసాని లక్ష్మయ్య, అశోక్, సతీష్, రంజిత్, ఉపేందర్, శ్రీను, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల: గొప్ప పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని సీపీఎం మండల కార్యదర్శి కల్లెపల్లి భాస్కర్ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగయ్య, లింగయ్య, సోమయ్య, వెంకన్న పాల్గొన్నారు.

మురుగు కాల్వ వివాదంపై అధికారుల విచారణ



నాగులపాటిఅన్నారం గ్రామంలో మురుగు కాల్వ వివాదంపై విచారణ చేస్తున్న ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ లాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెన్‌పహాడ్, సెప్టెంబరు 10: మండలంలోని నాగులపాటిఅన్నారం గ్రామంలోని 9వ వార్డులో మురుగు కాలువ నీరు మూసీ వాగులోకి వెళ్లకుండా డ్రైనేజీ మధ్యలో కొంత మంది రైతులు వేసిన అడ్డుకట్ట వేసిన ఉదంతంపై అధికారులు మంగళవారం విచారణ చేశారు. కొంత మంది రైతులు తమ పొలంలోకి మురుగు నీరు వస్తుందని డ్రైనేజీ మధ్యలో అడ్డుకట్ట వేశారు. ఆ మురుగు నీరు నిల్వ ఉండటం, ఇళ్లలోకి రావడంతో విపరీతమైన దుర్వాసన రావడంతో పాటు దోమల ఉధృతి పెరిగి గ్రామంలో విషజ్వరాలు ప్రబలాయి. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల నాలుగో తేదీన 'ముదురుతున్న మురుగు కాలువ వివాదం' అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ ధరావత్ లాలు, ఎంపీవో సంజీవ స్పందించి ఆ గ్రామంలోని మురుగు కాల్వను మంగళవారం పరిశీలించారు. ఐదు దశాబ్దాల నుంచి మురుగు నీరు ఇదేవిధంగా వాగులోకి వెళుతున్నందున రైతులు సహకరించాలని కోరారు. ఎవరైనా మురుగు నీటికి అడ్డుకట్ట వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బొమ్మకంటి కృష్ణయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ పిట్టల వెంకన్న, వివిధ పార్టీల నాయకులు మట్టయ్య, భిక్షమయ్య, పిచ్చయ్య, లింగయ్య, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, లచ్చయ్య, ముత్తయ్య, సతీష్, సైదులు, సాయి, యశోద, రాములు, మంగమ్మ, సోమయ్య పాల్గొన్నారు.

కందులకు గరిష్ఠ ధర రూ.9609

తిరుమలగిరి, సెప్టెంబరు 10: తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో కందులకు ఈసీజన్‌లో రెండో రోజు గరిష్ఠ ధర రూ.9609పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం ఓ రైతు రెండు బస్తాల్లో క్వింటా కందులు తీసుకురాగా గరిష్ఠ ధర రూ.9609 పలికిందన్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.7వేలు ఉండగా, అంతకు మించి ధర పలకడంతో రైతు సంతోషం వ్యక్తం చేశాడు.

ఎమ్మెల్యే పద్మావతికి పదవి రావడంపై హర్షం

కోదాడ రూరల్, సెప్టెంబరు 10: అంచనాల కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే పద్మావతి ఎన్నికైన సందర్భంగా మండలంలోని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. అంచనాల కమిటీ చైర్మన్‌గా పద్మావతి ఎన్నికైనందున కోదాడ నియోజకవర్గానికి అధికంగా నిధులు మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, ఎస్ఐ అనిల్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏఐజీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడిగా పుల్లయ్య

పెన్‌పహాడ్, సెప్టెంబరు 10: ఆలిండియా గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం (ఏఐజీడీఎస్‌యూ) సూర్యాపేట డివిజన్ అధ్యక్షుడిగా చలిగంటి పుల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామానికి చెందిన పుల్లయ్య అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సూర్యాపేటలో నిర్వహించిన ఆ సంఘం డివిజన్ ఐదో వార్షికోత్సవంలో పుల్లయ్యను ఎన్నుకున్నారు.

14న సీపీఎం నాయకుడు వెంకయ్య సంతాప సభ

పెన్‌పహాడ్, సెప్టెంబరు 10: మండలంలోనిచీదెళ్ల గ్రామంలో ఈ నెల 14వ తేదీన సీఎం నాయకుడు మర్రిపెల్లి వెంకయ్య సంతాప సభను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా నాయకుడు నెమ్మాది వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం చీదెళ్ల గ్రామంలో నిర్వహించిన సీపీఎం గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మట్టిపెల్లి సైదులు, ములకలపల్లి రాములు, పులుసు సత్యం, ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, వీరబోయిన రవి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

అర్వపల్లి, సెప్టెంబరు 10: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మంగళవారం స్వచ్ఛ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీదేవి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు విమల, స్వర్ణలత, ప్రసన్న, సునంద, అంజలి, వీరన్న, పీఈటీ డి.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దు

సూర్యాపేటఅర్బన్, సెప్టెంబరు 10: క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దని, జీవితంలో పోరాడి సాధించాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు షేక్ అలీమోద్దీన్ అన్నారు. ప్రపంచ ఆత్మహత్య నివారణ దినం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఆల్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, భాస్కర్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: సమస్యలతో ఆత్మహత్యలు చేసుకోకుండా మనోధైర్యం కల్పించాలని మానసిక వైద్య నిపుణురాలు, పీహెచ్‌సీ డాక్టర్ స్రవంతి అన్నారు. మంగళవారం పెన్‌పహాడ్‌లోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శశిరేఖ, జానకమ్మ, పూజ, ఝాన్సీ, ప్రియాంక, సుజాత, హేమబాయి, అనిత, అనూష, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తడిసిన ఎరువుల నష్టంపై అధికారులకు ఫిర్యాదు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 10: ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో తడిసిన ఎరువుల నష్టంపై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పీఏసీఎస్ చైర్మన్ జక్కుల నరేందర్ తెలిపారు. పీఏసీఎస్ గోదాంలో సుమారు రూ.7లక్షల విలువైన ఎరువులు తడిసి ముద్దయ్యాయని పట్టణంలోని తహసీల్దార్, వ్యవసాయశాఖ అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మల్లీశ్వరి, మధుసూదన్‌రెడ్డి, శ్రీను, బ్రహ్మం, పద్మ, వెంకటేశ్వర్లు, నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'వారోత్సవాలను విజయవంతం చేయాలి'

హుజూర్‌నగర్, సెప్టెంబరు 10: తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కంబాల శ్రీనివాస్ కోరారు. వారోత్సవాల కరపత్రాన్ని మంగళవారం మండలంలోని వేపలసింగారంలో ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ధనరాజ్‌రెడ్డి, శంభిరెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

గండ్లను త్వరితగతిన పూడ్చివేయిస్తాం



కేతిరెడ్డి ఫీడర్ చానెల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేలు

తుంగతుర్తి, సెప్టెంబరు 10: కేతిరెడ్డి ఆనకట్ట ఫీడర్ చానెల్‌కు పడిన గండ్లను త్వరితగతిన పూడ్చించి రైతులకు అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, వరదలకు మండలంలోని గొట్టిపర్తి, రావులపల్లి, చౌళ్లతండా గ్రామాల్లో కాల్వల ఆనకట్లకు పడిన గండ్లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పడిన గండ్లను పూడ్చడానికి రూ.13కోట్ల అవసరమని ప్రభుత్వానికి నివేదిక పంపామని, త్వరలో నిధులు మంజూరవుతాయని అన్నారు. ఎస్ఆర్ఎస్పీ జలాలు తుంగతుర్తి ప్రాంత రైతులకు త్వరలో అందుబాటులోకి వస్తాయన్నారు. అనంతరం గొట్టిపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, నీటి పారుదలశాఖ డీఈ సత్యనారాయణ, తహసీల్దార్ కంట్లమయ్య, ఎంపీడీవో శేషుకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దొంగరి గోవర్ధన్, గుడిపాటి సైదులు, సుంకరి జనార్దన్, వెంకన్న, చింతకుంట్ల వెంకన్న, కృష్ణారావు, దాయం ఝాన్సీరెడ్డి, ఉప్పుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ నష్టపరిహారం చెల్లిస్తాం

ఎమ్మెల్యే పద్మావతి



నర్సింహాపురంలో ధ్వంసమైన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

మోతె, సెప్టెంబరు 10: భారీ వర్షాలతో పంటలు కోల్పోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండంలోని నామవరం, రాఘవాపురం, సిరికొండ, విభలాపురం, నర్సింహాపురం, రంగాపురంతండా, లాల్‌తండా, రావిపహాడ్ గ్రామాల్లో నీట మునిగిన వరి, పత్తి, మిరప పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. నామవరం గ్రామ శివారులో వాగును, ధ్వంసమైన రోడ్డును పరిశీలించారు. అదేవిధంగా నర్సింహాపురం వంతెన సమీపంలో కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలతో పంటలతో పాటు పశువులు, ఇళ్లు కోల్పోయిన వారికి అధికారుల అంచనా మేరకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు. బాధితులు, రైతులు నష్టపోయిన వివరాలను వ్యవసాయ అధికారులకు తెలియజేయాలన్నారు. కోదాడ నియోజకవర్గంలో ధ్వంసమైన రోడ్లు, వంతెనలను నిర్మిస్తామన్నారు. మండలంలో తొమ్మిది రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని, వాటిని కూడా నిర్మిస్తామన్నారు. పంటలు నష్టపోయిన రైతుల వివరాల జాబితానే అధికారులు రూపొందించాలని, అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నామవరంలో పంటలకు నష్టం వాటిల్లకున్నా కొందరు రైతులు వారి పేర్లను పంట నష్టం బాధితుల జాబితాలో చేర్చాలని ఒత్తిడి తెస్తున్నారని వ్యవసాయాధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ధ్వంసమైన రోడ్ల వివరాలన్నింటికీ సేకరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముప్పాని ఆశ, మాజీ జడ్పీటీసీ పుల్లారావు, తహసీల్దార్ సంఘమిత్ర, ఏవో అరుణ, కీసర సంతోష్‌రెడ్డి, నూకల మధుసూదన్‌రెడ్డి, మైనంపాటి గుర్వారెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధితులకు ఇందిరమ్మ ఇళ్లను అందిస్తాం

చిలుకూరు: భారీ వర్షాలకు ఇళ్లు కోల్పోయిన బాధితులకు రేకులతో తయారుచేసిన ఇళ్లను అందించడంతోపాటు ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. వరద బాధితులకు మండలంలోని నారాయణపురం గ్రామంలో ఏర్పాటు చేసిన వసతులను ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో తెగిన చెరువుకట్టలకు, ధ్వంసమైన రోడ్లకు మరమ్మత్తు చేయిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీవో గిరిబాబు, ఆర్ఐలు సీతయ్య, శ్వేత, ఏవో శ్రీధర్, నాయకులు బొలిశెట్టి నాగేంద్రబాబు, బండ్ల కోటయ్య, కీతవెంకటేశ్వర్లు, యడవెల్లి పుల్లారావు, రాంరెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

అనంతగిరి: పంట నష్టపోయిన ప్రతి రైతుకూ న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. మండలంలోని కొత్తగూడెంలో వరదలకు దెబ్బతిన్న పంట పొలాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. త్వరలోనే నష్టపరిహారం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ముస్కు శ్రీనివాసరెడ్డి, వంగవీటి రామారావు, బుర్ర పుల్లారెడ్డి, కృష్ణానాయక్, గుర్రం వెంకటరెడ్డి, జొన్నలగడ్డ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో ఉండాలి



సూర్యాపేట 47వార్డులో దీపోత్సవంలో పాల్గొన్న మహిళా భక్తులు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 10: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో ఉండాలని శాసనసభ అంచనాల కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎన్టీవోస్ కాలనీలోని వినాయకుడి విగ్రహానికి నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, వైస్ చైర్మన్ సంపత్‌రెడ్డిశరణ్యాదొంతగాని శ్రీనివాస్, శివ, శ్రీనివాస్, సక్రునాయక్, వెంకట్‌రెడ్డి, లింగారెడ్డి, శ్రీనివాస్, శోభన్, సాయిరాం, మంజుల, రజిత తదితరులు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

తుంగతుర్తి, తిరుమలగిరి: తుంగతుర్తిలో జాంబవత యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో నిర్వహించిన పూజల్లో, తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంలోని పలు వినాయక మండపాల్లో నిర్వహించిన వినాయక పూజల్లో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుజ్జ యుగంధర్‌రావు, తాటికొండ సీతయ్య, గుండగాని రాములుగౌడ్, చెరుకు పరమేష్, గోపగాని శ్రీనివాస్, తడకమల్ల రవికుమార్, సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్, బత్తుల శ్రీధర్, దూపటి రవి, కందుకూరి బాబు, రాజారమేష్, నాగరాజు, రమేష్, మహేష్, నాని పాల్గొన్నారు.

సూర్యాపేట టౌన్: జిల్లా కేంద్రంలోని 37వార్డులో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో నిర్వహించిన పూజల్లో కౌన్సిలర్ బైరు శైలేందర్‌గౌడ్ పాల్గొన్నారు. తాళ్లగడ్డలో బైరు యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో నిర్వహించిన పూజల్లో బీఆర్ఎస్ నాయకులు కక్కిరేణి నాగయ్య, బైరు వెంకన్నగౌడ్, కక్కిరేణి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. విద్యానగర్‌లో నిర్వహించిన వినాయక పూజల్లో కౌన్సిలర్ గండూరి పావని పాల్గొని, అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. 48వార్డు కూరగాయల మార్కెట్‌లో కౌన్సిలర్ వెలుగు వెంకన్న అన్నదానం చేశారు. అదేవిధంగా 47వార్డులోని మహాలక్ష్మి నిలయంలో మహిళలు దీపోత్సవం నిర్వహించారు.

ఆత్మకూర్(ఎస్): గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని ఎస్ఐ సైదులు అన్నారు. పోలీస్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాత్రి 10గంటల తర్వాత లౌడ్ స్పీకర్లు పెట్టొద్దన్నారు. ఈ సమావేశంలో డీజేల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: పట్టణంలోని రామాలయం వీధి, రెడ్డిబజార్‌లో అన్నదాన కార్యక్రమాన్ని సీఐ చరమందరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో అమర్‌నాథ్‌రెడ్డి, ఫణికుమారి, రాంరెడ్డి, కారింగుల విజయవెంకటేశ్వర్లు, రమేష్, బుచ్చిబాబు, ఉపేందర్, పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: గణేష్ నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన గణేష్ మండపాల నిర్వాహణ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కృష్ణానదిలో వరద ప్రవాహం అధికంగా ఉన్నందున పోలీసులు ఏర్పాటుచేసిన ఘాట్లలోనే వినాయకులను నిమజ్జనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి, ఎస్ఐ పరమేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

● చింతలపాలెం మండలంలోని వజినేపల్లి సమీపంలో కృష్ణానది పుష్కర ఘాట్ వద్ద గణేష్ నిమజ్జన స్థలాన్ని, ఏర్పాట్లను తహసీల్దార్ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ సైదిరెడ్డి, ఎంపీడీవో భూపాల్‌రెడ్డి పరిశీలించారు.

ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట: కౌన్సిలర్

సూర్యాపేట అర్బన్, సెప్టెంబరు 10: వార్డుల్లో ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేశామని 45వార్డు కౌన్సిలర్ గండూరి పావనికృపాకర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని 45వార్డులో వీధి కుక్కలను మునిసిపల్ సిబ్బందితో పట్టించి మాట్లాడారు. రాత్రి వేళల్లో ప్రజలు వీధుల్లో తిరగాలంటే కుక్కలతో భయభ్రాంతులకు గురవుతున్నారనానరు. మునిసిపాలిటీ ఆధ్వర్యంలో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జవాన్ వెంకన్న, ఇస్మాయిల్, మహేష్, భిక్షం, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

గరిడేపల్లి, సెప్టెంబరు 10: ప్రతిఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.రేవతి అన్నారు. మంగళవారం మండలంలోని కీతవారిగూడెం అంగన్‌వాడీ కేంద్రం సెక్టార్-2లో జరిగిన పోషణ్ మాసోత్సవంలో భాగంగా బాలింతలు, గర్భిణులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మెనూ ప్రకారం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు మల్లమ్మ, సైదమ్మ, నారాయణమ్మ, హెచ్ఎం ఉమ, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సమాచారాన్ని నమోదు చేయాలి

నూతన్‌కల్, సెప్టెంబరు 10: ప్రభుత్వ పాఠశాలల విద్యారుల సమగ్ర సమాచారాన్ని యుడైస్ ప్లస్‌లో నమోదు చేయాలని ఎంఈవో రాములు నాయక్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన్‌కల్, మద్దిరాల మండలాల హెచ్‌ఎంలకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. యుడైస్ ప్లస్‌లో నమోదు చేసే వివరాలతోనే పాఠశాలల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఉమ్మడి మండలాల గెజిటెడ్ హెచ్‌ఎంలు, సీఆర్పీలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వరద బాధితులకు చీరల పంపిణీ

కోదాడ రూరల్, సెప్టెంబరు 10: భారీ వర్షాలకు కోదాడ మండలంలోని తొగర్రాయి, కూచిపూడి గ్రామాల్లో, అనంతగిరి మండలంలోని గోండ్రియాల గ్రామంలో పలువురు నిరాశ్రయులయ్యారు. బాధిత మహిళల కోసం కాంగ్రెస్ పార్టీ కోదాడ పట్టణ కోశాధికారి గరినే శ్రీధర్ రూ.15 వేలు విలువైన చీరలను క్యాంపు కార్యాలయంలో మునిసిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, వరద బాధితుల సహాయ నిధి ఇన్‌చార్జి మల్లేశ్వరికి మంగళవారం అందజేశారు. అనంతరం వాటిని బాధితులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పిలుపు మేరకు వరద బాధితులకు తనవంతు సహకారాన్ని అందించినట్లు శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవోపా పట్టణ అధ్యక్షుడు ఇమ్మడి రమేష్, పందిరి సత్యనారాయణ, గుడుగుంట శ్రీనివాసరావు, వెంపటి ప్రసాద్, గుడుగుంట్ల సాయి బెలీదే, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో దోమల మందు పిచికారీ

కోదాడ రూరల్, సెప్టెంబరు 10: మండలంలోని నెమలిపురి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో దోమల నివారణ మందును పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ సురేందర్, పీహెచ్ఎన్ అనంతలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది మధుబాబు, మీనాకుమారి, ఉపాధ్యాయులు లింగయ్య పాల్గొన్నారు.

కవి సామ్రాట్ చిత్రపటానికి నివాళి

అనంతగిరి, సెప్టెంబరు 10: తెలుగు సాహిత్యంలో తొలి జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతిని మంగళవారం మండలంలోని ఖానాపురం ఎంపీయూపీఎస్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విశ్వనాథ సత్యనారాయణ జీవిత విశేషాలను తెలుగు ఉపాధ్యాయుడు సుశర్మ వివరించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జహీర్‌ఖాన్, దుర్గ పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ ఉచిత బస్ పాస్‌లు అందజేయాలి



ఆర్టీసీ డీఎం సురేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న పీవోడబ్ల్యూ నాయకులు

సూర్యాపేట అర్బన్, సెప్టెంబరు 10: విద్యార్థులందరికీ ఉచిత బస్ పాసల్‌లు ఇవ్వాలని పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్‌స్టేషన్‌లో విద్యార్థులతో సంతకాలు సేకరించి అనంతరం సూర్యాపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సురేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని, రద్దుచేసిన బస్సులను తిరిగి ప్రారంభించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బస్సుల సంఖ్యను తగ్గించారని, జాతీయ రహదారులపై ఎక్స్‌ప్రెస్ బస్సుల సంఖ్యను తగ్గించి సూపర్ లగ్జరీ బస్సులను పెంచడం సరికాదన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని నీరుగార్చేందుకే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బస్‌స్టేషన్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రేణుక, సంతోషిమాత, పద్మ, శారద, కరీంబీ, రేణుక, విజయ్, ప్రవీణ్, కిశోర్, మోహన్ పాల్గొన్నారు.